క్లుప్తంగా

మున్సిపల్ చైర్మన్ల ఫోరం ఉపాధ్యక్షులుగా రజని



తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ల ఫోరం ఉపాధ్యక్షులుగా తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీ రాజశేఖర్ శుక్రవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన మున్సిపల్ చైర్మన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

దురాజ్‌పల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల ఐదు నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 36,500లకు పైగా, జిల్లాలో 1700 మంది గ్రామపంచాయతీ కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరికి ప్రతినెలా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

సూర్యాపేట రూరల్ : హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బాలెంల, ఎర్కారం, రామన్నగూడెం గ్రామాల రోడ్ల వెంట నాటిన మొక్కలకు శుక్రవారం గ్రీన్‌డేలో భాగంగా నీళ్లు పోసి మాట్లాడారు. అనంతరం రామన్నగూడెం గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనిల్, విక్రం, అనిత పాల్గొన్నారు.

ఆత్మకూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుష్ప



ఆత్మకూర్ (ఎస్) : మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుష్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండల తహసీల్దార్‌గా పనిచేసిన హేమమాలిని సూర్యాపేట కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో సూర్యాపేట కలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చిన పుష్ప ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న లాలు నాయక్ సూర్యాపేటకు బదిలీ అయ్యారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

దురాజ్‌పల్లి : చివ్వెంల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్‌లో వాటర్ ట్యాంక్ కూలి చనిపోయిన మోతె మండలం అప్పన్నగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి పవన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గాయపడిన వారికి కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

గడువు పొడిగింపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 20వరకు పొడిగించినట్లు జాజిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపల్ కె.శమంతకమణి తెలిపారు. 4వతరగతి చదువుతున్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

తుంగతుర్తి : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ శ్యామలత తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

నాగారం : తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన నాగారంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బాలగాని నారాయణగౌడ్ రోజు వారిగానే కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. వర్షం కురిసిన కారణంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. దీంతో ఆయనకు రెండు కాళ్లు విరిగి గాయాలైనాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

కోదాడరూరల్ : రైతులు ఇతర పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని ఏఓ పాలెం రజిని సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిబండ రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు దిగుబడి వచ్చేంత వరకు ఇతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. పంట సాగుతో వచ్చే సబ్సిడీలు వంటి విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు సల్మా, మహేష్, రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నిధులున్నా.. పనుల్లో వీడని జాప్యం

- నూతన జీపీ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు
- పెన్‌పహాడ్ పరిధిలో తొమ్మిది గ్రామాలకు రూ.1.80 కోట్లు విడుదల
- స్థలాల సమస్యతో పనులకు ఆటంకం



న్యూబంజారాహిల్స్ తండాలో అద్దె భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం

పెన్‌పహాడ్ : కొన్ని గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ నిర్మాణ పనులు నేటికీ ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. మండలంలోని 9 గ్రామాల్లో నూతన పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం రూ. 1.80కోట్లు విడుదల చేసింది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పనుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు.

ఒక్కో గ్రామానికి రూ. 20లక్షల చొప్పున..

మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను శిథిలావస్థకు చేరిన లింగాల, గాజులమల్కాపురం, దోసపహాడ్ గ్రామాల గ్రామ పంచాయతీలతో పాటు నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు మేగ్యా తండా, న్యూబంజారాహిల్స్ తండా, చిన గారకుంట, చిన సీతారాంతండా, తంగెళ్లగూడెం, రంగయ్యగూడెం గ్రామాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం రూ. 20లక్షల చొప్పున కేటాయించింది.

మూడు పంచాయతీ భవనాలకు శంకుస్థాపన..

మండలంలోని దోసపహాడ్ గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గాజులమల్కాపురం, చిన సీతారాంతండా గ్రామ పంచాయతీ భవనాలకు అధికారులు పనులు మొదలు పెట్టారు. మిగతా ఆరు గ్రామాల్లో పనులు నేటికీ ముందుకుసాగడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

భవనాల నిర్మాణాలకు స్థల సమస్య...

ప్రభుత్వం నూతన జీపీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ స్థల సమస్య ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పాత భవనాల స్థలంలో నిర్మిస్తే స్థలం సరిపోదని, కొత్త స్థలంలో నిర్మాణం చేయాలంటే ప్రభుత్వ స్థలం దొరక్క సమస్య ఏర్పడుతుందంటున్నారు. మేగ్యా తండా, న్యూబంజారహిల్స్ గ్రామాల్లో పంచాయతీలకు స్థల సమస్య ఉందని అధికారులు తెలిపారు.

కొన్ని జీపీలకు స్థల సమస్య



మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో నూతన జీపీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. కోటి 80లక్షలు మంజూరు చేసింది. భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం. కొన్ని గ్రామాల్లో స్థల సమస్య నెలకొంది. వాటిని పరిష్కరించి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– గోపి, పీఆర్ ఏఈ, పెన్‌పహాడ్

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

తిరుమలగిరి : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని తిరుమలగిరి జెడ్పీటీసీ దూపటి అంజలిరవీందర్ అన్నారు. శుక్రవారం మర్రికుంట తండాలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవానాయక్, వైద్యాధికారిని మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, క్యాంపు డాక్టర్ సమతారాణి, పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాకూబ్‌నాయక్, సరిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

మినీ ట్యాంక్ బండ్ పనుల్లో నాణ్యత లోపం



మినీ ట్యాంక్ బండ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

భానుపురి : కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న మినీ ట్యాంక్ బండ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించాయని, సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంట్ల ధర్మార్జున్ అన్నారు. పట్టణంలోని సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్‌పై కుంగినకట్ట, విరిగిపోయిన రెయిలింగ్‌ను శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు నాణ్యత ప్రమాణాలు మరిచి కమీషన్ల మీదనే దృష్టి పెట్టారని విమర్శించారు. నిర్మాణ పనులు సాగుతుండగానే రెయిలింగ్ కుంగిపోతుందని, మరోవైపు చెట్లు నాటక ముందే కట్టకు అమర్చిన సిమెంట్ బిల్లలు పగిలిపోతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు గట్ల రమాశంకర్, జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్యయాదవ్, పట్టణ అధ్యక్షుడు బంధన్ నాయక్, జిల్లా నాయకులు బొడ్డు శంకర్, ఎస్టీ సెల్ నాయకులు దేవత్ సతీష్, మైనార్టీ నాయకులు ఖలీల్, విద్యార్థి జనసమితి నాయకులు నక్క సాయిగౌడ్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : ఈ నెల 23న గరిడేపల్లిలో నిర్వహించనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) సూర్యాపేట జిల్లా ఐదవ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల యాజమాన్యాలకు కార్మిక చట్టాలను తాకట్టుపెట్టి పాదసేవ చేస్తోందని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ వివిధ రంగాల కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కునుకుంట్ల సైదులు, హమాలీ ఫెడరేషన్ నాయకులు హరి ప్రసాద్, షఫి, నరేష్, వేల్పుల ఉప్పలయ్య, జలగం వెంకన్న పాల్గొన్నారు.

అరెస్టు చేయడం తగదు

నాగారం : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం తగదని బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు కమటం శోభబాయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లికేజీపై సీబీఐ విచారణ జరిపించి, గ్రూప్–1 ప్రిలి మ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లక్డీకపూల్‌లో నిరాహార దీక్షకు దిగిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. లిక్కర్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయాలని, నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఆమెతో పాటు ఎర్ర రాంబాబు, ఈదుల యాదగిరి, మల్లేపాక వెంకటేష్, చెరుకుపల్లి లక్ష్మణ్, చుక్క సురేష్ ఉన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెంలో అనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న నల్లగొండ జిల్లా శాలిగౌరారం జట్టుకు రూ. 25వేలు నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి గెలుచుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు జట్టుకు రూ. 15వేల నగదు, షీల్డ్‌లను క్రీడల నిర్వాహకుడు కేతిరెడ్డి శివారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో రేఖల సైదులు, వంగూరి నరేష్‌బాబు, అనిరెడ్డి సూర్యవర్ధన్‌రెడ్డి, కేతిరెడ్డి మహేష్‌రెడ్డి, కేతిరెడ్డి కార్తీక్‌రెడ్డి, జడ గణేష్, దొరెపల్లి వీరయ్య, జె. వెంకన్న పాల్గొన్నారు.



క్రీడాకారులకు షీల్డ్‌లు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీరామాయణ పారాయణం ప్రారంభం



పారాయణం నిర్వహిస్తున్న అర్చకులు

భానుపురి : జిల్లాకేంద్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని సంకట మోచన ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం శ్రీరామాయణ పారాయణంను ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు ప్రారంభించారు. మొదటి రోజు సంక్షేప రామాయణ పారాయణం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. పారాయణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు శ్రీ టీఎస్‌వీ సత్యనారాయణ, బజ్జూరి కృష్ణయ్య, మంజుల, అరుణమ్మ, జ్ఞానకుమారి, సుభాషిని, అరుణ, సరోజ, రమాదేవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో మార్పు మొదలైంది



పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దురాజ్‌పల్లి : తెలంగాణలో మార్పు మొదలైందని బీజేపీ నాయకులు అన్నారు. ఉమ్మడి హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అబీబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, కౌన్సిలర్ కట్కూరి కార్తీక్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పలస మల్సూర్ గౌడ్, జిల్లా కోశాధికారి పగిళ్ల సుసిందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, వెన్న శశిధర్ రెడ్డి, పోకల రాములు, పేర్వాల లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి సంధ్యాల సైదులు, పట్టణ, మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్సులు ఇవ్వాలి

ఆత్మకూర్ (ఎస్) : అర్హులైన గీత కార్మికులందరికీ కొత్త లైసెన్సులు ఇవ్వాలని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ గౌడ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడల యువకులు రాజకీయంగా ఎదగాలని, వృత్తిపై ఆధారపడిన గౌడలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నూతన లైసెన్స్‌ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీసు మల్లేష్‌గౌడ్, ఎంపీటీసీ ఉపేందర్‌గౌడ్, గౌడ సంఘం సర్పంచ్ బత్తుల వెంకన్న, యువజన సంఘం అధ్యక్షుడు కట్ట అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు తీసుకుంటున్న కేఎల్ఎన్ ప్రసాద్

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు కంటి వెలుగు విజయవంతానికై శుక్రవారం రామన్నగూడెంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉపేందర్‌రావు, సర్పంచ్ రమావత్ పీరమ్మ, సారథి జిల్లా టీంలీడర్ మేడిపల్లి వేణు, కళాకారులు వెన్నెల నాగరాజు, ఉదయ్, శ్రీకాంత్, రాములు, ఉపేందర్, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

పొన్నమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు తూముల ఇంద్రసేనారావుల మాతృమూర్తి తూముల పొన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, మాజీ జెడ్పీటీసీ పిన్నాని కోటేశ్వర్‌రావు, కోనం వెంకన్న, కోతి గోపాల్‌రెడ్డి, నూకల సుదర్శన్‌రెడ్డి, భూక్య సందీప్‌రాథోడ్, లక్ష్మణ్‌బాబు, రాంబాబుగౌడ్, మామిడి వెంకటేశ్వర్లు, రవీందర్, సైదులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎంపీపీ..

టీపీసీసీ కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ తూముల ఇంద్రసేనారావుల మాతృమూర్తి పొన్నమ్మ ఇటీవల మృతిచెందగా శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్‌లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్ రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, సొడయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

కుక్కల స్వైర విహారం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిధిలోని తొండ గ్రామంలో కుక్కల బెడద రోజు రోజుకూ అధికమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో వీధి కుక్కలు శుక్రవారం రెండు దూడలను కొరికి చంపేశాయి. మరో దూడను తీవ్రంగా గాయపరిచాయి. గ్రామంలో కుక్కల బెడద అధికమవడంతో చిన్నారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి సభను జయప్రదం చేయాలి

పెన్‌పహాడ్ : ఈ నెల 19న సూర్యాపేట మండలం రాయినిగూడెంలో జరిగే తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఎర్రజెండా ముద్దుబిడ్డ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని లింగాల, దూపహాడ్ గ్రామాల్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఎర్రజెండా పక్షాన పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గుంజా వెంకటేశ్వర్లు, రణపంగ బుచ్చిరాములు, బాదె సత్యవతి, మట్టయ్య, సోమయ్య, రవి, అనిల్, మధు, సునీత తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం సీనియర్ నాయకులు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట మండలం రాయినిగూడెంలో ఈ నెల 19న నిర్వహించే ప్రథమ వర్ధంతి సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తొట్ల అచ్చయ్య, కట్ట నర్సిరెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, జటంగి లింగయ్య పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న రణపంగ కృష్ణ

19న మల్లు స్వరాజ్యం వర్ధంతి సభ

అర్వపల్లి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ ఈ నెల 19న రాయినిగూడెంలో జరుగుతుందని, ఈ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మల్లు స్వరాజ్యం చిన్న వయస్సులో దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడి పేదల పక్షాన నిలిచారని చెప్పారు. ప్రథమ వర్ధంతి సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, నాయకులు మేడెబోయిన సైదులు, లింగయ్య, ఉడుగు సైదులు, వర్రె సాయమ్మ, లింగరాజు పాల్గొన్నారు.



అర్వపల్లి : మాట్లాడుతున్న యాదగిరిరావు

అంగన్‌వాడీలకు సొంత భవనాలు

- కొమ్మాల, రామన్నగూడెంలలో జరుగుతున్న పనులు
- డీఎంఎఫ్ నిధులతో నిర్మాణం

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం జరుగుతుంది. మండల వ్యాప్తంగా 36అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 31 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నడిపిస్తున్నారు. మిగిలిన ఐదు కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అయితే కొన్నింటిలో సౌకర్యాలు కొరవడటం, అద్దె భవనాలు ఇరుకుగా ఉండటంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెంలో డీఎంఎఫ్ నిధులు రూ.9లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి సొంతభవన నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడి కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలలోని ఓ తరగతి గదిలో నడిపిస్తున్నారు. అలాగే కొమ్మాల గ్రామంలో కూడా డీఎంఎఫ్ నిధుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవన నిర్మాణం జరుగుతుంది. అయితే ఈ గ్రామంలో ప్రస్తుతం మంజూరైన నిధులు చాలక భవన నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడింది. అదనంగా మరికొన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీలకు వెళ్లే చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు, సిబ్బందికి ఇబ్బందులు తీరనున్నాయి.



రామన్నగూడెంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం

ఇబ్బందులు తీరనున్నాయి



రామన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా పాఠశాలలో నడిపిస్తున్నాం. ఈ కేంద్రంలో 30మంది పిల్లలు చదువుకుంటుండగా, 25మంది గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం పొందుతున్నారు. కానీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించే గదులు ఇరుకుగా ఉండటం, సౌకర్యాలు కొరవడటంతో ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తీరనున్నాయి.

– పుష్ప, అంగన్‌వాడీ టీచర్, రామన్నగూడెం

త్వరలోనే పనులు పూర్తి



రామన్నగూడెంలో డీఎంఎఫ్ నిధులు రూ.9లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం జరుగుతుంది. భవన నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేయనున్నాం. అలాగే కొమ్మాలలో ప్రస్తుతం మంజూరైన నిధుల వరకు పనులు జరిగాయి. మరికొన్ని నిధులు మంజూరైతే పనులు పూర్తి కానున్నాయి.

– అశోక్, పీఆర్ ఏఈఈ

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

చివ్వెంల : వికలాంగులకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. శుక్రవారం మండల పరిధిలోని కొండల రాయినిగూడెంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వికలాంగ బంధు కింద ప్రతి ఒక్కరికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ లక్ష్మి పథకం కింద వికలాంగులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెపల్లి విజయ్, సామేలు, ధనమ్మ, మారతమ్మ, ప్రేమలత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిద్దె రాజేష్

పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించాలి

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గాన్ని దళితబంధు పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఈదుల రమేష్‌చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దళితులు అధికంగా ఉన్నారని, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాన్ని దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించాలన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు బండగొర్ల జనార్దన్, సతీష్, జక్కలి నరేష్, నరేష్, గుండు నర్సయ్య, శ్రీను, సందీప్ ఉన్నారు.

పేపర్ లీకేజీ వ్యవహారంలో దోషులను శిక్షించాలి

నూతనకల్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో దోషులను శిక్షించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దెల రామ్మూర్తి, యానాల వెంకట్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కాసరబాద రోడ్డులోని అపూర్వ బధిరుల పాఠశాలలో తుంగతుర్తి ఎస్ఐ డేనియల్ కుమార్తె బోరెల్లి మోక్షజ్ఞ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బధిరుల విద్యార్థుల నడుమ కేక్ కట్ చేశారు. అనంతరం పాఠశాలకు 50కేజీల బియ్యం, టేబుల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు హరిత, పాఠశాల నిర్వాహకులు మధుసూదనచారి, సరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



రెడ్డిగూడెంలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బర్పటి ఉపేందర్, ఎంపీటీసీ నాగెల్లి శ్రీలత శ్రవణ్‌కుమార్, దుగ్యాల రవీందర్‌రావు, రేట్నేని వెంకటయ్య, జన్నయ్య, తాందారి ప్రతాప్, తీగల వెంకన్న, చాపల వెంకన్న పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు

తిరుమలగిరి : మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పన్నుల బకాయిలు, నల్లా బిల్లులు వెంటనే చెల్లించాలని అన్నారు. ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, అనంతరం నల్లా కనెక్షన్ తొలగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, సోంమల్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.